క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

బల్మూర్: బాల్యవివాహాలు చేయడం చట్ట విరుద్ధమని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులు మధుబాబు, ప్రమీల అన్నారు. ఆదివారం మండలంలోని ఓ గ్రామంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. ఓ గ్రామానికి చెందిన బాలికకు పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారు. బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు శనివారం రాత్రి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను నాగర్‌కర్నూల్ చైల్డ్ వెల్ఫేర్ కమ్యూనిటీకి తరలించినట్లు తెలిపారు. తల్లితో పాటు ఇరు కుటుంబాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

కొనసాగుతున్న కంటివైద్య శిబిరం

వంగూరు: మండలం కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం ఆదివారం కొనసాగింది. రెండు రోజుల్లో దాదాపు 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 30 మందికి ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు. వారం రోజుల పాటు క్యాంపు కొనసాగుతుందని గ్రామస్తులు వేమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని గగ్గలపల్లి, తూడుకుర్తి, భాగ్యనగర్‌లో ఆదివారం పశు వైద్యాధికారులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు కల్పన మాట్లాడుతూ రైతులు తప్పనిసరి మూగజీవాలకు టీకాలు వేయించాలని కోరారు. మొత్తం 2008 గేదేలకు ఇప్పటివరకు 568 పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యం, శ్రీశైలం, వినయ్, నిరంజన్, నితిష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం

మన్ననూర్: ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని ఎస్ఎఫ్ఐ నియోజకవర్గం అధ్యక్షుడు ఎండీ సయ్యద్ విమర్శించారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నిత్యవసర ధరలు రోజు రోజుకు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వంటగ్యాస్ ధర రూ.50 పెంచడం దారుణమన్నారు. ఇప్పటికై నా కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించాలని కోరారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన నాయకులు



మన్ననూర్: అనారోగ్య సమస్య నుంచి కోలుకుంటున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను ఉమామహేశ్వరం, మద్దిమడుగు ఆలయాల పాలక మండలి సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్‌లో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు మాధవరెడ్డి, రాములు పాలక మండలి సభ్యులు సంబు శోభ వెంకటరమణ, పవన్, వినోద్, ఈఓ శ్రీనివాసులు, వీరయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి వినతి



అచ్చంపేట: సీఎం ఎనుమల రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాలను పోస్టులు చేసిన వ్యక్తిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఎస్ఎస్‌యూఐ నాయకులు అచ్చంపేట ఎస్ఐ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్ మాట్లాడుతూ సీఎంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని వివరించారు. ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు లడ్డు యాదవ్, అనిల్, వెంకటేష్, అంజియాదవ్, తిరుపతి, గణేష్, అంజి పాల్గొన్నారు.

అధ్వానంగా లింక్ రోడ్లు

- అవస్థలు పడుతున్న గ్రామీణులు
- పట్టించుకోని అధికారులు

లింగాల: మండలంలోని పలు గ్రామాల లింక్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రం నుంచి అనేక గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ లింక్ రోడ్లపై చూపెట్టడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. లింగ్ రోడ్లు పూర్తిగా ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లింకు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో రాకపోకలకు కొనసాగించలేని దుస్థితి నెలకొంది. ఆయా గ్రామాల మధ్య దూరం తగ్గించేందుకు నిర్మించిన రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు.

మండలంలో లింక్ రోడ్ల వివరాలు..

మండలంలోని పలు గ్రామాలలో ఉన్న లింక్ రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కోమటికుంట నుంచి జీల్గుపల్లి, రాయవరం ప్రధాన మార్గం నుంచి కొత్త చెర్వుతండా, బాకారం నుంచి వల్లభాపూర్, అవుసలికుంట నుంచి శాయిన్‌పేట, కొత్తకుంటపల్లి నుంచి అవుసలికుంట గ్రామాల మధ్య లింక్ రోడ్లు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి లింక్ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలమయంగా మారాయి. కొన్ని చోట్ల కంకర తేలి ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది.



ఇరుకుగా ఉన్న కోమటికుంట-జీల్గుపల్లి లింక్ రోడ్డు

నిధులు మంజూరు చేయాలి



రాయవరం ప్రధాన మార్గం నుంచి కొత్తచెర్వుతండా రోడ్డు అధ్వాన్నంగా మారింది. కంకర తేలి గుంతలమయంగా మారడంతో రాక పోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలి.

–కవి మహరాజు, కొత్తచెర్వుతండా

మరమ్మతు చేయాలి



గ్రామాల మధ్య దూరం తగ్గించే లింక్ రోడ్లను బాగు చేయాలి. కోమటికుంట నుంచి జీల్గుపల్లి వరకు లింక్ రోడ్డు ఉన్నప్పటికి కొన్నేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోక అధ్వాన్నంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

–వేణుగోపాల్, కోమటికుంట

ఆలయాల అభివృద్ధికి కృషి

తిమ్మాజీపేట: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని హేమ్లా నాయక్‌తండా శివారులో చోళుల కాలంలో నిర్మించిన పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలు కలియ తిరిగి ఆలయ అభివృద్ధిపై స్థానికులతో చర్చించారు. నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

అట్టహాసంగా జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో 11 ఎద్దుల జతలు తలపడ్డాయి. ఈ పోటీలలో మొదటి బహుమతి రూ.25 వేలు బైకని మహేష్(లింగాల), రెండో బహుమతి రెండో బహుమతి రూ.20 వేలు దశరథం(తాడూర్), జస్వంత్(వెల్టూర్) సంయుక్తంగా దక్కించుకున్నారు. మూడో బహుమతి రూ.10 వేలు పర్వతాలు(గంట్రావుపల్లి), నాలుగో బహుమతి రూ.5 వేలు పూజారి భాస్కర్, కాసీం(లింగాల) సంయుక్తంగా గెలుపొందగా, ఐదో బహుమతి రూ.4 వేలను శివ (అవుసలికుంట) గెలుపొందారు. విజేతలకు నిర్వాహకులు కొండల్‌రావు, ఏఎస్ఐ శ్రీనివాసులు బహుమతులను అందజేశారు.



బండను లాగుతున్న ఎద్దుల జత

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

వెల్దండ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప దేవాలయానికి సంజీవ్‌కుమార్ యాదవ్ ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. దైవభక్తిని ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిందం కృష్ణయ్య, తంబాలు, చిన్న వెంకటయ్య, జంగయ్య, రాములు, కుమార్, జంగయ్య, తదితరులు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న సంజీవ్‌కుమార్

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



నాగర్‌కర్నూల్‌లో ఎంబీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కందనూలు: జిల్లా కేంద్రంలో ఎంబీ చర్చిలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు చర్చి సమీపంలోని శిలువ వద్దకు వెళ్లి ఏసు క్రీస్తు పునరుత్థానం గురించి పాస్టర్ వీఎస్ భాస్కర్ వివరించారు. చర్చి ఆరాధన కార్యక్రమంలో భాగంగా భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ముఖ్య అతిథి బాలు భాగ్యరావు పాల్గొని ధార్మిక సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంబీ చర్చి చైర్మన్ పి.సంపత్‌కుమార్, చర్చి కమిటీ సభ్యులు, సంఘం పెద్దలు, మహిళలు, పాల్గొన్నారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈసందర్భంగా ఎంబీ వార్కంటిన్ మెమోరియల్ చర్చి రెవరెండ్ జేబీ రాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీమన్నారు. చర్చి చైర్మన్ జోహాన్న విల్సన్, వైస్ చైర్మన్ స్టీవెన్ సన్, సెక్రటరీ రామస్వామి, జాయింట్ సెక్రటరీ, జగదీష్, ఇజ్రాయిల్, సురేష్ బాబు, జ్యోతి పాస్టర్ అమ్మ, యూత్ సభ్యులు నేరటి రవి, జ్యోతి ప్రసాద్, నందు, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్ట్సు వితరణ



లింగాల: మండలంలోని దారారం గ్రామానికి చెందిన 50 మంది క్రికెట్ క్రీడాకారులకు ఆదివారం అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాజ మణెమ్మ ఫౌండేషన్ చైర్మన్ నూకల శంకర్‌బాబు టీ షర్టులను వితరణ చేశారు. గ్రామానికి చెందిన క్రీడాకారులు డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించుటకు నిర్ణయించారు. క్రీడాకారుల అభ్యర్థన మేరకు సామాజిక కార్యకర్త రూ.20 వేలు విలువ చేసే 55 టీ షర్టులను కొనుగోలు చేసి క్రీడాకారులకు అందజేశారు. సందర్భంగా దాతను క్రీడాకారులు సన్మానించారు. దాతను పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

జెడ్పీహెచ్ఎస్‌లో వైద్య శిబిరం



లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో జడ్చర్ల ఏగూరు ప్రైమ్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో వైద్యులు బాలు, జిలాని, హిదిరిస్ సంధ్యారాణి దాదాపుగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. శిబిరాన్ని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జి.రాజేందర్ సందర్శించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర కిషన్‌నాయక్, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అజీమ్, యాదగిరి, ఆనంద్, ప్రకాష్, శ్రీకాంత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆదివారం స్థానిక ఎస్ఐ రామన్‌గౌడ్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.



ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో పలు కాలనీలలో ప్రజలు వారికి ఇష్టం వచ్చినట్లుగా రోడ్లను తవ్వకాలను చేపడుతున్నారు. అవసరం ఉన్నా, లేకున్నా రోడ్లను తవ్వుతున్నారని దీంతో నూతనంగా వేసిన రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. రోడ్లను తవ్వే సమయంలో మున్సిపాలిటీ అధికారుల అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో రోడ్లు యథేచ్ఛగా తవ్వుతున్నారని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు కాలనీవాసులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మహేమూద్ షేక్‌ను వివరణ కోరగా ఇంటి ముందు డ్రెయినేజీ కోసం రోడ్డు తవ్వటానికి అనుమతులు తీసుకున్నారని, తవ్విన గుంతను తిరిగి వారే పూడ్చివేస్తారని లేనిపక్షంలో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రేపు పూలే, అంబేద్కర్ జాతర



బిజినేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఆవరణలో ఈ నెల 22న అంబేడ్కర్, పూలే జాతర నిర్వహిస్తునట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూలే, అంబేద్కర్ జాతరకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బహుజన నాయకులు తుమ్మల అల్లోజీ, రామన్‌గౌడు, బంగారయ్య, శివయ్య, గఫూర్, విజయకాంత్, ఆజీమ్, శివ, సత్యనారాయణ, బాలయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం

తిమ్మాజీపేట: మండలంలోని చేగుంటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు పాఠశాల గదులను గ్రామానికి చెందిన కదిరె రాంరెడ్డి, కృష్ణమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కూతురు కదిరే సునీత రెడ్డి రూ.35 లక్షలతో నిర్మించారు. ఆదివారం పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 1998– 99 సంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు.

మైసమ్మ దర్శనానిని పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని మైసమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వనపర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, పెబ్బేరు, గద్వాల, నాగర్‌కర్నూల్ నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు.

ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

వెల్దండ: మండల కేంద్రంలోని వీజేఆర్ హోటల్ వద్ద టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీకి ఆదివారం జర్నలిస్టులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో సన్మానించారు. 21న కొల్లాపూర్ నియోజకవర్గంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ, రవి, కృష్ణయ్య, బాలయ్య, కల్వకుర్తి, వెల్దండ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాచూర్‌లో జైభీమ్ యాత్ర



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఆదివారం జైభీమ్, జై బాపు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిమ్మాజీపేట: మండలంలోని గుమ్మకొండ కెనాల్ నిర్మాణం పనుల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్‌కు రాష్ట్రానికి చెందిన యువకుడు ఉమేష్(26)మృతిచెందాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్న ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న ఉమేష్ ద్విచక్ర వాహనంపై తిమ్మాజీపేటకు వస్తుండగా మార్గమధ్యలో వెనుక నుంచి ఓమ్ని వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వారాంతపు సంతలో సమస్యలు

- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కోడేరులో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

కోడేరు: మండల కేంద్రంలో వారాంతపు సంతలో సమస్యలు నెలకొన్నాయి. అన్నదాతల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నా క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల వ్యాపారులకు వసతులు కల్పించడం లేదు. దీంతో సంతలో సమస్యలు నెలకొన్నాయి. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతలో సమస్యలు తిష్ఠ వేశాయి. కోడేరుతో పాటు ఎత్తం, తీగలపల్లి, రాజాపూర్ గ్రామాల్లో ప్రతివారం కూరగాయల సంత నిర్వహిస్తుంటారు. రైతులు సంతలో అవస్థలు పడాల్సి వస్తోంది. పస్పుల, కదిరెపాడు, నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, సింగాయిపల్లి, రేవల్లి, జనుంపల్లి తదితర గ్రామాల నుంచి రైతులు పండించిన కూరగాయలు సంతలో విక్రయిస్తున్నారు. సంత రోజు దాదాపు రూ.లక్ష వరకు టర్నోవర్ జరుగుతుందని పంచాయతీ వారు తైబజార్ వసూలు చేస్తున్నారు. సంత ప్రధాన రహదారిపై ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై సంత వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సంతలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సంత ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

కనీస వసతులు కరువు

సంతలో ప్రతి వ్యాపారి దగ్గర నుంచి పంచాయతీ అధికారులు తైబజార్ వసూలు చేస్తున్నారు. వారికి షెడ్లు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించకపోవడంతో వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలోనే కూరగాయలు విక్రయించాల్సిన దుస్థితి. కూరగాయల మార్కెట్ కోసం ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

కనీస సదుపాయాలు కల్పించాలి



ప్రతి మంగళవారం మండల కేంద్రంలో జరిగే కూరగాయల సంతలో వ్యాపారులు, కొనుగోలుదారులకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వసతులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకొని తాగునీరు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

– మంగలి శేఖర్, కోడేరు

సంతను మరొక చోటికి మారుస్తాం

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జరిగే వారాంతపు సంత కోసం ఖాళీగా ఉన్న అనువైన చోటును ఎంపిక చేసి అక్కడికి సంతను మారుస్తాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.

– శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ, కోడేరు

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



మార్చాల పల్లగుట్టపై టిప్పర్‌లో మట్టిని పోస్తున్న జేసీబీ(ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలో గుట్టలను తవ్వేస్తూ కొంతమంది మట్టి మాఫియా దోపిడీకి తెగబడుతున్నారు. అనుమతులు ఉన్నాయని చెబుతూ దందాను దర్జాగా కొనసాగిస్తున్నారు. మట్టి మాఫియాకు వివిధ శాఖల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కుల అక్రమాలకు అడ్డుకట్ట వేసే వారే లేకుండా పోయారు. గుట్టలను తవ్వుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. మండలంలోని మార్చాలా పల్లగుట్టకు ఎంతో పురాతన చరిత్ర ఉంది. గుట్టపై పాండవులు ప్రతిష్ఠించిన హనుమాన్ దేవాలయం ఉంది. ఆ దేవాలయం సమీపంలో నుంచే మట్టిని తవ్వి అక్రమ సంపాదనకు తెరలేపారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో భారీ టిప్పర్లతో మట్టిని తవ్వుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవు రోజుల్లో అనుమతి ఉండదు. ఆదివారం సెలవు ఉన్న తవ్వకం ఆగడం లేదు అంటే పరిస్థితులు ఎంతవరకు వచ్చాయో తెలుస్తుంది. ఇదిలా ఉంటే మండలంలోని రఘుపతి పేట గ్రామ పంచాయతీ పరిధిలో రామగిరి పవిత్ర రామాలయం ఉంది. ఆలయానికి సమీపంలోనే దేవాలయానికి సంబంధించిన భూమిలో గుట్టలు ఉన్నాయి. కొన్ని రోజులు రహదారి పేరుతో, ప్రస్తుతం ఇంకో పని పేరుతో మట్టిని తవ్వేస్తున్నారు. మట్టిని తవ్వడంతో ఏర్పడిన ఖాళీ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. దేవాలయ భూమిని ఆక్రమించుకునే కార్యక్రమాలకు కొందరు ఒడిగడుతున్నట్లు ఆరోపణలు రావడంతో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ బృందం మట్టి తవ్వకాలను పరిశీలించింది. వెంటనే తవ్వకాలు ఆపాలని తహసీల్దార్ ఇబ్రహీం, సీఐ నాగార్జునతో పాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. మార్చాలా పల్లగుట్టను కాపాడాలని గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేశారు. మట్టి తరలింపుపై తహసీల్దార్ ఇబ్రహీంను వివరణ కోరగా మైనింగ్ పరిధిలో ఉంటుందని తమకు సంబంధం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.